ప్రజాశక్తి

ర్యాలీ అగ్రభాగాన కమ్యూనిస్టు నాయకుల చిత్రాలతో భారీ జెండా ప్రదర్శన

అనంత అరుణవర్ణం

మహిళల, చిన్నారుల కోలాటం

అనంతలో మహాప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు

వై.వెంకటేశ్వర్లు

ప్రభాకర్ రెడ్డి

వి.రాంభూపాల్

జి.ఓబులు

బహిరంగ సభలో ఉరుము కళాకారుల ప్రదర్శన

- ఘనంగా సిపిఎం జిల్లా మహాసభ ప్రారంభం
- నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- ఎరుపెక్కిన అనంత దారులు
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు
- ప్రత్యేక ఆకర్షణగా రెడ్‌షర్ట్స్ వాలంటీర్ల కవాతు
- చైతన్యం నింపిన నాయకుల ప్రసంగాలు

అనంతపురం

నగరం అరుణవర్ణం దాల్చింది. ఎక్కడ చూసినా సిపిఎం ఎర్రజెండాలు రెపరెపలాడాయి. ఉద్యమ నినాదాలు హోరెత్తాయి. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డప్పుల దరువులు.. చిన్నారులు, మహిళల కోలాటం ఉత్సాహపరిచాయి. వందలాది మంది రెడ్‌షర్ట్స్ వాలంటీర్ల కవాతు, మహిళలు సిపిఎం జెండాలను పట్టుకుని ప్రదర్శన ముందు నడుచుకుంటూ వచ్చిన తీరు అద్భుతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నేతల ప్రసంగాలు ఉత్తేజపరిచాయి. చైతన్య స్ఫూర్తితో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సోమవారం నాడు సిపిఎం 14వ అనంతపురం జిల్లా మహాసభ ప్రారంభమైంది. సోమ, మంగళవారం రెండు రోజుల పాటు ఈ మహాసభ జరగనుంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎరుపెక్కిన 'అనంత' నగరం

సిపిఎం 14వ మహాసభ ప్రారంభ సందర్భంగా సోమవారం ఉదయం అనంతపురం నగరంలో భారీ ప్రదర్శన జరిగింది. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు జరిగింది. ఈ ర్యాలీలో ముందు వరుసగా కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డప్పు కళాకారుల మోతలు, ఉరుము కళాకారుల ప్రదర్శనలతోపాటు, ఎర్ర చీరలు ధరించిన మహిళలు కోలాటం ఆడుతూ ప్రదర్శన ముందు వరుసలో నడిచారు. ఆ తరువాత ప్రముఖ కమ్యూనిస్టు నాయకుల చిత్రపటాలతో రూపొందించిన 40 మీటర్ల పొడువైన ఎర్రజెండాను పట్టుకుని రెడ్‌షర్టు వలంటీర్లు నడిచారు. వారి వెనుక సిపిఎం ముఖ్య నేతలు ప్రదర్శనగా ముందుకుసాగారు. ఎంతో క్రమశిక్షణతో సాగిన ఈ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

ఆలోచింపజేసే విధంగా సాగిన నేతల ప్రసంగాలు

ప్రదర్శన అనంతరం లలిత కళాపరిషత్ హాలులో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వర రావు, ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలో అధికారంలోనున్న బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, మత విద్వేష రాజకీయాల గురించి వై.వెంకటేశ్వరరావు నిశితంగా దుయ్యబట్టారు. రాష్ట్రంలోనూ మత విద్వేషాలను రగల్చే ప్రయత్నం సాగుతోందని విమర్శించారు. 'ఇంట్లో కులం-బయటకొస్తే హిందువులం' అన్న పేరుతో కార్యక్రమాలను చేపడుతున్నారని తెలిపారు. 'ఇంట్లో కులం,మతం-బయటకొస్తే భారతీయులం' అన్న నినాదాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముందని వివరించారు. ప్రజల మధ్య ఐక్యతను సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయాన్ని ప్రయివేటుకు కట్టబెట్టేందుకు మోది ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. రైతులు పెద్దఎత్తున ఉద్యమాలు చేపడితే వెనక్కు తగ్గినట్లు కనిపించినా... ఇతర రూపాల్లో దీన్ని ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం మరోమారు చేస్తూనే ఉన్నారన్నారు. విద్యుత్ ఒప్పందాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపణ లొస్తున్నా... అధికారంలో నున్న టిడిపి ఎందుకు నోరు మెదపటం లేదో ప్రజలకు చెప్పాలన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకమని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన నారా లోకేశ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కార్పొరేట్లకు ఊడిగం చేసే విషయంలో మోది అయినా...,చంద్రబాబు అయినా... జగన్మోహన్‌రెడ్డి అయినా ఒక్కటే అన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో తెలుగుదేశం పార్టీ ఒకటి, రెండు మినహా అన్నింటినీ అటకెక్కించిందని విమర్శించారు. సిపిఎం సీనియర్ నాయకులు జి.ఓబుళు మాట్లాడుతూ అనంతపురం జిల్లాకు సాగు, తాగునీటిని అందించే హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువల ఆధునీకరణను ఈ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ సిపిఎం ఈ మూడు సంవత్సరాల కాలంలో చేపట్టిన కార్యక్రమాలను పున:సమీక్షించుకుని, రాబోయే మూడు సంవత్సరాల కార్యాచరణను ఈ 14వ మహాసభలో నిర్ణయించుకోనున్నట్లు వివరించారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, ఎస్.నాగేంద్రకుమార్, బి.శ్రీనివాసులు, వి.సావిత్రి, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌వి.నాయుడు, వై.వెంకటనారాయణ, ఎం.కృష్ణమూర్తి, తరిమెల నాగరాజు, భాస్కర్, ఎం.నాగమణి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, అచ్యుత్‌ప్రసాద్, రామాంజినేయులు, నిర్మల, రంగారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, సూర్యచంద్ర, మల్లికార్జున, నాయకులు ఓతూరు పరమేష్, మసూద్, వలీ, ప్రకాష్, ముత్తుజా, గోపాల్, బిహెచ్.రాయుడు, కుళ్లాయప్పతో పాటు జిల్లా వ్యాప్తంగా సిపిఎం శ్రేణులు పాల్గొన్నారు.

చిన్నారితో వి.రాంభూపాల్

మహాసభలో పాల్గొన్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అవసరం

ప్రతినిధుల సభలో రాంభూపాల్

జిల్లాలో వ్యవసాయ, ఉపాధి, సాగునీరు తదితర వాటికి ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలియజేశారు. సిపిఎం అనంతపురం జిల్లా 14వ మహాసభ మధ్యాహ్నం మూడు గంటల నుంచి అనంతపురం నగరంలోని గుత్తిరోడ్డు ఎస్ఎన్ గ్రాండ్ ఫంక్షన్ హాలులో ప్రారంభమయ్యాయి. ప్రతినిధుల సభ ప్రాంగణమైన ముష్కిన్ నగర్‌లో రెండు రోజుల మహాసభ ప్రారంభమైంది. దీనికి ముందు సిపిఎం జెండాను సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు నాగరాజు ఎగురవేశారు. అనంతరం అమరవీరుల స్థూపానికి పూలుజల్లి నివాళులు అర్పించారు. సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరితోపాటు ఈ కాలంలో చనిపోయిన మృతులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో వై. వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. దేశం, రాష్ట్రంలో ఉత్పాదకత తగ్గిపోయిందన్నారు. ఉద్యోగులు, కార్మికులకు ఉన్న సదుపాయాల్లో కూడా కోతలు విధిస్తున్న పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కార్పొరేట్ విధానాలను అమలు చేయడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా అతలాకుతలం అవుతున్న స్థితి ప్రస్తుతం ఉందన్నారు. నియంతృత్వ విధానాలు రాచరికం ఎక్కువ కాలం సాగవన్నది సత్యం అన్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల వాగ్దానాలను అమలు చేయని పరిస్థితి ఉందన్నారు. అనంతపురం జిల్లాలో వ్యవసాయం, విద్యా, వైద్యం రంగాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలో విస్తారమైన భూమి ఉన్నప్పటికి సాగునీటి వనరులు లేక పూర్తి స్థాయిలో పంటలు సాగు జరగడం లేదన్నారు. వైవిధ్యమైన ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాయలసీమ డిక్లరేషన్‌లోని 18 అంశాలు అమలు చేయాలన్నారు. ప్రజా, కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థి, యువత సమస్యలన్నింటినీ మహాసభల్లో చర్చించి వాటి పరిష్కారానికి భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ణయించనున్నట్లు తెలియజేశారు.

రైల్వే సమస్యలపై కేంద్ర సహాయ మంత్రికి వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గంలో రైల్వేకు సంబంధించి వివిధ సమస్యలను పరిష్కరించాలని కేంద్ర రైల్వే శాఖ సహాయమంత్రి వి.సోమన్నకు సోమవారం తుమకూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విప్ కాలవ శ్రీనివాసులు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా టిడిపి ప్రభుత్వ హయాంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో రాయదుర్గంలో అనంతపురం, కనేకల్లు రహదార్లపైన రెండు రైల్వే వంతెనల పనులను ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం అవి అసంపూర్ణంగా ఉన్నాయని, త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రాయదుర్గం నుంచి బళ్లారికి నిత్యం వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని, చదం సమీపంలోని రైల్వే గేట్ వద్ద నూతన వంతెన నిర్మాణం అవసరముందన్నారు. దీనివల్ల ఆ మార్గంలో రాకపోకలు నిరంతరాయంగా సాగేదానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అలాగే మరో ముఖ్యమైన రాయదుర్గం - గుమ్మఘట్ట రహదారిలో పట్టణ శివార్లలో మరో వంతెనను నిర్మించాలని కాలవ కోరారు. కాగా అత్యంత వెనుకబడిన రాయదుర్గం నియోజకవర్గంలో వేలాది కుటుంబాలు గార్మెంట్స్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ఇక్కడ తయారవుతున్న రెడీమేడ్ దుస్తులు దేశ వ్యాప్తంగా ఎగుమతి అవుతున్నాయన్నారు. గార్మెంట్స్ రంగ పురోగాభివృద్ధికి, ఎగుమతుల్లో వేగం పెరిగేలా ఈ ప్రాంతం మీదుగా వెళ్తున్న యస్వంతపూర్ - టాటానగర్, మైసూరు - వారణాసి, యశ్వంతపూర్ - జైపూర్ రైళ్లు రాయదుర్గం స్టేషన్‌లో ఆగేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాగే రాయదుర్గం రైల్వేస్టేషన్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, రెండవ ప్లాట్‌ఫారంను విస్తరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, డి.హీరేహాల్ టిడిపి మండల కన్వీనర్ హనుమంతురెడ్డి ఉన్నారు.



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

వినియోగదారుల చట్టంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

వినియోగదారుల చట్టంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని తూనికలు, కొలతల శాఖ డివిజినల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ సూచించారు. సోమవారం స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వినియోగదారుల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర కంటే అధిక ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని కొంతమంది వ్యాపారులు తూకాల్లో మోసాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుడు చట్టంపై అవగాహన కలిగి ఉంటే ఇలాంటి మోసాలను అరికట్టవచ్చన్నారు. వినియోగదారులను మోసం చేసే వ్యాపారులను గుర్తించి చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆ దిశగా వినియోగదారుల్లో చైతన్యం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసులు, విశ్రాంత ఉపన్యాసకుడు ఆయూబ్‌ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, కోదండరాములు, అధ్యాపకులు పాలరాజ్, దేవదాస్, పాండురంగ, లీలావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తూనికలు, కొలతల శాఖ డివిజినల్ ఇన్‌స్పెక్టర్ శంకర్

యాడికి కాలువకు నీరు విడుదల

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని యాడికి కాలువకు ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సోమవారం నీరు విడుదల చేశారు. ముందుగా గంగమ్మకు పూజలు చేసి కాలువ గేట్లు ఎత్తి నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం యాడికి కాలువకు నీరు విడుదల చేసినట్లు తెలిపారు. నీటి విడుదల వల్ల మండలంలోని సుమారు 15 గ్రామాల బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతుందన్నారు. కాగా కనీసం 25 రోజులపాటు కాలువకు నీరు విడుదల చేయాలని పలువురు రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమ నాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, పరిమి చరణ్, తెలుగు యువత నాయకులు తాంద్ర విక్రమ్, రవికుమార్‌రెడ్డి, గండికోట లక్ష్మణ్, ఆదినారాయణ, శ్రీహరి, చలమారెడ్డి, రామచంద్రారెడ్డి, చందన సర్పంచి రామాంజనేయులు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు బాగుంటేనే దేశం సుభిక్షం

జాతీయ రైతు దినోత్సవంలో ఎంపి అంబికా

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

రైతు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ పేర్కొన్నారు. అనంతపురం పట్టణంలోని రజాక్ ఫంక్షన్ హాల్‌లో రైతు సంఘాలు, రైతు సహాయ సంఘాల ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ రైతులు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. రైతుల కోసం తాను కిసాన్ ట్రైన్‌ను ఏర్పాటు చేసే ప్రయత్నాన్ని కేంద్రస్థాయిలో చేస్తున్నానన్నారు. ఈ మధ్యకాలంలో తాడిపత్రి నుంచి బనానాను రైలు ట్రాన్స్‌పోర్టు ద్వారా విదేశాలకు అధికారులు, నాయకుల సహకారంతో ఎగుమతి చేయించామని చెప్పారు. ఆర్డీటీ మల్లారెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలందరూ ఇంటికి పరిమితమైతే రైతులు మాత్రమే వ్యవసాయం చేసి ప్రజలకు ఆహారాన్ని అందించారని గుర్తు చేశారు. నరేంద్ర స్వరూపా మాట్లాడుతూ తాను ఏర్పాటు చేసినటువంటి రైతు సహకార వేదిక రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. నాగరాజు, బానుజాతో కలసి రైతులకు న్యాచురల్ ఫార్మింగ్ లో శిక్షణ ఇవ్వడం తమకు సంతోషంగా ఉందన్నారు. విద్యుత్ తీగల వల్ల అనుకోని ప్రమాదంలో మృతిచెందిన రైతుల కుటుంబాలకు 25 వేల రూపాయల చొప్పున హార్టికల్చర్ రైతు సంఘం నాయకులు భాస్కర్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. రెండు రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన 60 మంది రైతులను రైతు రత్న బిరుదుతో పాటు సన్మానించారు. అంతకు ముందు నిర్వాహకులు ఎంపీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, యువకులు, రైతు సంఘాల నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఎంపి అంబికా లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న రైతులు

విశాల ఫెర్రర్‌కు సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్‌డిటి సంస్థ మహిళా విభాగం డైరెక్టర్ విశాలఫెర్రర్‌కు బెంగళూరులో సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ అవార్డ్-2024 అవార్డు అందజేశారు. సామాజిక సేవలో విశాల ఫెర్రర్ అందిస్తున్న సేవలను గుర్తించి స్వా సంస్థ సిఇఒ రాధ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా విశాలఫెర్రర్ మాట్లాడుతూ మహిళ అభ్యున్నతికి కృషి చేసినందుకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ట్రాంస్కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్‌చౌదరి, రవికాంత్ క్యాటరర్స్ రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న విశాలఫెర్రర్

క్రీడలతో మానసికోల్లాసం : ఎస్పీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

నిత్యం విధుల్లో బిజీగా ఉండే పోలీసు సిబ్బందికి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫిజికల్ ఫిట్‌నెస్ తో పాటు మానసికోల్లాసాన్ని కల్గిస్తాయని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా కొంత వరకు పని ఒత్తిడి నుంచి కూడా ఉపశమనం పొందవచ్చని, నిత్యం మనం చేసే విధులకు ఈ క్రీడా స్ఫూర్తి ఎంతో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే జిల్లా పోలీస్ స్పోర్ట్ అండ్ గేమ్స్ మీట్ -2024 స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో ఎస్పీ సోమవారం ప్రారంభించారు. ఈ స్పోర్ట్ మీట్లో జిల్లాలోని ఎఆర్, స్పెషల్ పార్టీ విభాగాలతో పాటు ఏడు సబ్ డివిజన్లకు సంబంధించిన పోలీసు క్రీడాబృందాలు పాల్గొన్నాయి. ముందుగా స్పోర్ట్స్ మీట్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభమయినట్లు సంకేతంగా కాగడా(జ్యోతి) వెలిగించారు. పతాకాలను ఆవిష్కరించారు. శుభసూచికగా తెల్ల కపోతాలను, బెలూన్లను ఎగురవేశారు. జిల్లా ఎస్పీ క్రీడాకారులను పరిచయం చేసుకుని వారి నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ డిజిపి ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం స్పోర్ట్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. హోదాలు మరచి అందరూ ఒక టీంగా ఏర్పడి చిన్న, పెద్ద అనే బేధాలు లేకుండా సిబ్బంది మధ్య ఒక స్నేహపూర్వక వాతావరణం ఈ కార్యక్రమం వల్ల ఏర్పడుతుందన్నారు. అంతేకాకుండా ఒక పని కోసం అందరూ కలసి శ్రమించే సమిష్టితత్వం అలవడుతుందన్నారు. సిబ్బంది మధ్య సమన్వయం పెరుగుతుందని, సమిష్టిగా, సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి సవాళ్లనైనా సులువుగా ఎదుర్కొనవచ్చునని తెలుపుతుందన్నారు. పోలీసుశాఖలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, దేహదారుఢ్యం కల్గి ఉండటం చాలా ముఖ్యమని, ఈ స్పోర్ట్ అండ్ గేమ్స్ వల్ల ఇవి మెరుగుపడుతాయని చెప్పారు. జిల్లాలో నిర్వహించే క్రీడల్లో మంచి ప్రతిభను కనబరిచి రేంజ్ , రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగే పోలీసు క్రీడల్లో బాగా రాణించి జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. అనంతరం 800 మీటర్ల పరుగు, వాలీబాల్ క్రీడలను ఎస్పీ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, డీఎస్పీలు వెంకటేష్, రవిబాబు, రామకృష్ణుడు, ఎస్బీ సిఐలు ధరణీకిశోర్, క్రాంతికుమార్ , ఆర్ఐలు రెడ్డెప్పరెడ్డి, రాముడు, సిఐలు రాజేంద్రనాథ్ యాదవ్, శ్రీకాంత్, శాంతిలాల్, కనుమూరి సాయినాథ్, రఘు ప్రసాద్, శ్రీహర్ష, రామసుబ్బయ్య, మస్తాన్, నీలకంఠ, యువరాజు, ఇస్మాయిల్, హరినాథ్, వెంకటేష్ నాయక్, పోలీసు డాక్టర్ వెంకటేష్ ప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ఐ జాఫర్, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్, లక్ష్మినారాయణ, సరోజ, ఆనంద్, నాగరాజు, ఆర్ ఎస్ఐలు జాఫర్, మగ్బూల్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ జగదీష్

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్టు

మూడు కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ఓ కారులో గంజాయి తరలిస్తున్న సోమవారం నలుగురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకోవడంతోపాటు మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు 1వ పట్టణ సిఐ బి.మనోహర్ తెలిపారు. ఈమేరకు పట్టణంలోని 1వ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎస్పీ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలపై గట్టిగా వేసి ఉంచామన్నారు. ఇందులో భాగంగా రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో జిఆర్పి ఎస్ఐ జయప్రకాష్ రెడ్డితోపాటు తమ సిబ్బంది సోదాలు నిర్వహిస్తుండగా ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వరి నుంచి రైలులో గుంతకల్లుకు గంజాయి తీసుకొచ్చి ఇక్కడి నుంచి బళ్లారికి కారులో తరలిస్తుండగా బళ్లారి చెందిన రాము, వెంకటసాయి, రామకృష్ణతోపాటు స్థానిక షికారి కాలనీకి చెందిన దుర్గేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి మూడు కిలోల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్న కేసు నమోదు చేశామన్నారు. అదుపులోకి తీసుకున్న నలుగురిని జిల్లా కోర్టు నందు హాజరు పరిచినట్లు తెలిపారు.

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సిఐ బి.మనోహర్

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా ఎం.మహేంద్ర

ప్రజాశక్తి-గుంతకల్లు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా ఎం.మహేంద్రను నియమిస్తూ ఆపార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేంద్ర మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండకట్టడానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే, ప్రియాంకగాంధీ ఎన్నో పోరాటాలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా ఏపి రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిలారెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వంపై ప్రజా పోరాటం చేస్తోందన్నారు. వారి అడుగుజాడల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అంతేగాకుండా అందరినీ కలుపుకుని ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. పట్టణ అధ్యక్షులుగా తనను నియమించిన పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డి, డిసిసి అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డికి సహకరించిన జిల్లా నాయకులు గాలి మల్లికార్జున, ఆలం నవాజ్, రహమతుల్లా, నబిరసూల్, ఫిరోజ్‌ఖాన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కడప ఎమ్మెల్యే తీరు అప్రజాస్వామికం

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కడప కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే మాధవి వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత రెండు కౌన్సిల్ సమావేశాల్లో కడప ఎమ్మెల్యే మాధవి అక్కడి మేయర్ పక్కన తనకు కుర్చీ ఏర్పాటు చేయాలని నిబంధనలకు వ్యతిరేకంగా డిమాండ్ చేస్తూ దౌర్జన్యం చేస్తున్న తీరు మంచిది కాదన్నారు. మాధవి వ్యవహార శైలితో ముఖ్యమైన ప్రజా సమస్యల అజెండా చర్చకు రాకుండా పక్కదోవ పడుతోందన్న విషయాన్ని ఆమె గుర్తించడం లేదన్నారు. ఎమ్మెల్యేకు కొన్ని పరిధులు ఉంటాయని ఎమ్మెల్యే అని అసెంబ్లీలో తనకు కేటాయించిన సీట్లోనే కూర్చుంటారన్నారు. ఆరు నెలల కూటమి పాలనలో సామాన్యుల నుంచి ప్రజాప్రతినిధుల వరకూ రక్షణ కొరవడిందన్నారు. కడప మేయర్‌పై సాక్షాత్తు కూటమి ఎమ్మెల్యేనే దౌర్జనానికి పాల్పడటం ఇందుకు నిదర్శనమన్నారు. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదనే విషయాన్ని కూటమి నేతలు గుర్తించాలన్నారు. ఇప్పటికైనా కూటమి నేతలు దౌర్జన్యాలు మానుకుని అభివృద్ధి, సంక్షేమం కోసం పని చేయాలని సూచించారు.

విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

మహిళలకు జీవనోపాదులపై శిక్షణ అవసరం

మహిళలు తయారు చేసిన వస్తువులను ప్రదర్శిస్తున్న విశాలపెర్రర్, మహిళలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మహిళలకు జీవనోపాదులపై శిక్షణ ఎంతో అవసరం ఆర్‌డిటి మహిళా విభాగం అభివృద్ధి డైరెక్టర్ విశాలపెర్రర్ అన్నారు. సోమవారం మండలంలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో ఉన్న కళాకారుల సెంటర్‌లో మహిళలకు జీవనోపాదులపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా ఆకులు, జిగురు కాయలు వంటి వాటిని రంగులు తయారు చేసి క్లాత్‌పై అచ్చులు వేసి నాణ్యమైన డోర్ కర్టన్స్, పిల్లో, టవల్స్, వంటి వాటిని తయారు చేసుకుని విక్రయించి కుటుంబ పోషణ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మగువా ఫౌండేషన్ ప్రతినిధి శ్రీలక్ష్మి, సంధ్య, ఎటిఎల్ సుధాకర్, మహిళా విభాగం ప్రతినిధి అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఎఎన్‌ఆర్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-శింగనమల

జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో మండల కేంద్రంలోని ఎఎన్‌ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు అంత్యత ప్రతిభ కనబరిచారు. విశ్వం ఎడ్యుటెక్ సంస్థ జోనల్ మేనేజర్ శివాంజనేయులు, ట్రైనర్ హెడ్ ఆంజనేయులు, ట్రైనర్ కబీర్ అధ్వర్యంలో అనంతపురంలో జిల్లాస్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. స్టార్ సీనియర్స్ విజువైలైజేషన్ విభాగంలో పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థి భూమా రవివరుణ్‌యాదవ్ జిల్లాస్థాయిలో మొదటి బహుమతి సాధించాడు. స్టార్ జూనియర్స్ విభాగంలో 2వ తరగతి విద్యార్థిని బెస్త భాగ్యోదయ మొదటి బహుమతి సాధించింది. దీంతో పాఠశాల యాజమాన్యం, పిల్లల తల్లిదండ్రులు అభినందించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎఎన్‌ఆర్ యాజమాన్యం

నేడు రాష్ట్రస్థాయి జూడో క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-పామిడి

రాష్ట్రస్థాయి జూడో టోర్నమెంట్‌కు మంగళవారం ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జూడో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సాకే గోవింద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంపికైన వారిని సీనియర్, క్యాడెట్, సబ్ జూనియర్స్ కేటగిరి వివిధ భాగాల్లో నిర్వహించబోయే టోర్నమెంట్‌కు పంపనున్నట్లు తెలిపారు. అర్హులైన క్రీడాకారులు రిజిస్ట్రేషన్ కోసం నేరుగా ఉదయం 8 గంటలకు అంబేద్కర్ భవన్‌కు వచ్చి వారి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్.. 99891 95158 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

త్వరలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని త్వరలో మార్పు చేయనున్నట్లు కార్యాలయ అధికారి సమీర్‌బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కార్యాలయంగా కొనసాగుతున్న భవనం యజమాని భవనాన్ని ఖాళీ చేయాలని తెలిపారన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం 1300 చదరపు అడుగుల నుంచి 15 వందల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న భవనం, వాహనాల పార్కింగ్ సౌకర్యం, భవనం అద్దె ప్రతిపాదన అవసరం ఉందన్నారు. కావున అలాంటి భవనం ఉన్న యజమానులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనను సంప్రదించాలని కోరారు.

'అమ్మ' సంస్థ ఆపన్నహస్తం

అనంతపురం : నగరంలోని అరవింద్ నగర్‌లో ఉన్న అనాథలు, అంధుల ఆశ్రమంలో 40 మంది విద్యార్థులకు అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి పరుపులు, బెడ్‌షీట్లు, చదువులకు అవసరమైన మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పుట్టపర్తి అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అమ్మ సంస్థ చేపట్టిన గొప్ప సేవ కార్యక్రమంలో తాను భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు.

ఆర్‌ఎంపిలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

పెద్దవడుగూరు : గ్రామాల్లో వైద్యం అందిస్తున్న ఆర్‌ఎంపి వైద్యులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి పని చేయాలని పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాసబాబు, అమర్నాథ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో మండలంలోని ఆర్‌ఎంపి వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీవద్దకు వచ్చే గ్రామీణులు త్వరగా కోలుకోవాలని స్టెరాయిడ్ వంటి ఇవ్వరాదన్నారు. స్టెరాయిడ్ ఇవ్వడం ద్వారా రోగులు మరింత బలహీనపడుతారన్నారు. కావున జిల్లా ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు తగు మోతాదులో మందులు అందజేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరారు. అనంతరం గ్రామాల వారిగా వివరాలు తెలుసుకుని సూచనలు, సలహాలను అందజేశారు.

ఎజిపిగా పి.ఫక్రుబాషా నియామకం

గుత్తి : పట్టణంలో నివాసం ఉండే సీనియర్ న్యాయవాది పి.ఫక్రుబాషా ఎజిపి (సహాయ ప్రభుత్వ న్యాయవాది)గా నియమితులయ్యారు. ఈమేరకు న్యాయశాఖ ఆయనకు నియామకపత్రాన్ని సోమవారం అందజేశారు. తనకు పదవి రావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశానవాటికలో నీటి వసతి కల్పించాలని వినతి

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని కేసేపల్లి గ్రామంలో ఉన్న శ్మశానవాటికలో నీటి వసతి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక సచివాలయంలో వ్యకాసం నాయకులు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు నిర్వహించిన తర్వాత కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడానికి నీటి వసతి లేదన్నారు. కావున వెంటనే స్పందించి శ్మశాన వాటికలో నీటి వసతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎర్రినాగప్ప, శ్రీనివాసులు, నారాయణస్వామి, రాము, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న వ్యకాసం నాయకులు

విద్యుత్ బాదుడుపై 27న పోరుబాట

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరునెలల్లోనే పేదలపై రూ.15,485 కోట్ల విద్యుత్ భారం మోపడాన్ని నిరసిస్తూ ఈనెల 27వతేదీన వైసిపి ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించినున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం అనంతపురంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో 'కరెంట్ ఛార్జీల బాదుడుపై వైసిపి పోరుబాట' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సిఎం చంద్రబాబు విఫలమయ్యారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచారన్నారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ఎలాంటి కరెంటు ఛార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చాక విపరీతంగా విద్యుత్ ఛార్జీలు మోపడం బాధాకరమన్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలతో సామాన్య ప్రజలే కాకుండా కుటీర, మధ్య తరహా పరిశ్రమలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పామిడి, రాయదుర్గం, పెనుకొండ, హిందూపురంలో అధికంగా ఉన్న కుటీర పరిశ్రమలు మూతబడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే తాడిపత్రిలో బండల ఫ్యాక్టరీలు మూసి వేస్తున్న పరిస్థితి వచ్చిందన్నారు. కావున విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజలను భాగస్వామ్యం చేసుకుని ర్యాలీలు నిర్వహించి విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎంపి తలారి రంగయ్య, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజల్లో విశ్వాసం పెంచే దిశగా ప్రభుత్వ వైద్యం

పెద్దాసుపత్రి ప్రధాన పర్యవేక్షకుడు కెఎస్ఎస్.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా ప్రజల్లో విశ్వాసం పెంచే దిశగా అనంతపురం జిల్లా సర్వజన ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ప్రధాన పర్యవేక్షకుడు కెఎస్ఎస్. వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఈ ఏడాది ప్రజావైద్యంలోని పలు విభాగాల్లో పురోగతిని వివరించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 2024 జనవరి నుంచి ఇప్పటి వరకూ ఔట్ పేషెంట్ విభాగంలో 7,26,716 మందికి, అడ్మిషన్స్ 69,832, అత్యవసర విభాగానికి ఒపి 1,09,029 మందికి సేవలు అందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలో నూతనంగా ఆరు ఓపిలు, ఒక అడ్మిషన్ కౌంటర్లను పెంచినట్లు తెలిపారు. వీటితోపాటు పిల్లలు, మహిళలు, వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాన్ని కొత్తగా ప్రారంభించామన్నారు. ఈ విభాగం ద్వారా రోగులకు అత్యవసర చికిత్స అందిస్తున్నటుల వివరించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వైద్యులను సమన్వయం చేసుకుని ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తూ ప్రజల్లో విశ్వాసం పెంపొందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే నర్సులు, పారామెడికల్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పారిశుధ్య కార్మికులను సమన్వయం చేసుకుని ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్లపై మురుగునీరు రానీయొద్దు

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మురుగునీరు రోడ్లపైకి వచ్చి ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రధాన వీధుల్లో మురుగునీరు పారడాన్ని గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై మురుగునీరు ఎలా ప్రవహిస్తోందని ప్రశ్నించారు. మురుగునీటి కాలువ సరిగలేనందున నీరు రోడ్డుపై ప్రవహిస్తోందని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఆంజనేయులు తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఇకనుంచి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. మురుగునీటి కాలువలను పటిష్టం చేసి ఎప్పటికప్పుడు పూడికి తీసివేయాలన్నారు. అనంతరం పలు దుకాణ యజమానులు, ప్రజలతో కరచాలనం చేసుకుంటూ ముందుకు సాగారు. ఈకార్యక్రమంలో ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ రాజారెడ్డి, జిల్లా తెలుగు యువత పార్లమెంటరీ నాయకుడు దివాకర్‌రెడ్డి, గంగరాజు, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాయకులు ఆవులాంపల్లి కేశవరెడ్డి, హరినాథరెడ్డి, ప్రసాద్‌యాదవ్, నాగేశ్వర్‌రెడ్డి, రవిశేఖరెడ్డి, నారాయణస్వామి, చిరంజీవి, నరేంద్ర, నాగరాజు, హరికృష్ణారావు, లక్ష్మీనారాయణ, దాదావలి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ భారతదేశ 5వ ప్రధానమంత్రి చౌదరి చరణ్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని జాతీయ రైతు దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. రైతు లేకపోతే సమాజ మనుగడ లేదన్నారు. కావున రైతును ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబుస్సుం, ఎఒ గోపాల్, డీన్‌లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, అకాడమీ కోఆర్డినేటర్ ఇర్షాద్, ప్రైమరీ ఇన్‌ఛార్జి భారతి, తదితరులు పాల్గొన్నారు.

రైతును సన్మానిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి

అలాగే హౌసింగ్ బోర్డులోని శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎజిఎం సుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం రైతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, అకాడమిక్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్ సత్యనారాయణ, చంద్రమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరవకొండ : జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు ఆధ్వర్యంలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురం బళ్లారి బైపాస్ రోడ్డు నుంచి ఉరగాద్రి కళ్యాణ మండపం వరకూ రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళ్యాణమంటపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్రాంతి రైతులను ఘనంగా సన్మానించారు. తర్వాత విద్యుదాఘాతంతో మృతిచెందిన రైతు కుటుంబాలను సన్మానించడంతోపాటు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజేష్ కళ్యాణి, ఎడిఎలు రవి, యల్లప్ప, లక్ష్మణ్‌నాయక్, వివిధ మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులు, యోగా మాస్టర్ భాస్కర్‌నాయుడు, రైతులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రైతు వినతి

ప్రజాశక్తి-గుత్తి

వంశపార్యపరంగా వస్తున్న తమ భూమికి రెవెన్యూ అధికారులు ఇతరులకు అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేసి అన్యాయం చేశారని బాచుపల్లికి చెందిన రైతు పారా రామచంద్ర వాపోయాడు. ఈమేరకు సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు విలేకరులతో మాట్లాడుతూ గుత్తి మండలం కరిడికొండ గ్రామపంచాయతీ పరిధిలోని బాచుపల్లి గ్రామానికి చెందిన పారా రామచంద్ర తన తండ్రి పారా హనుమన్న, ఆయన తండ్రి రామయ్యకు సర్వే నంబర్ 158-బిలో 0.25 సెంట్లు,159-బిలో 0.16 సెంట్లు, 160 సర్వే నంబర్ లో 0.20 సెంట్లు భూమి ఉండేదని చెప్పారు. 0.20 సెంట్ల భూమిలో 34 సంవత్సరాల క్రితం మూడు ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామన్నారు. 1949లో తమ తాత పారారామయ్య, తమ తండ్రి పారా హనుమన్న పేరుపై మీద రిజిస్ట్రేషన్ చేయించారని తెలిపారు. తమ భూమిపై పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని రెండేళ్లుగా తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగిన అధికారులు మంజూరు చేయలేదన్నారు. ధర్మాపురంలో విధులు నిర్వహించే వీఆర్‌ఓ రాజేష్, కరిడికొండ విఆర్‌ఓ లావణ్య కలిసి తమ భూమిని రెవెన్యూ అధికారులతో అక్రమంగా వీఆర్వో రాజేష్ తండ్రి మోరం పెద్ద వెంకటేష్, మోరం చిన్న వెంకటేష్ పేరిట పాస్ పుస్తకాలు మంజూరు చేయించారని వాపోయారు. విచారించి అక్రమంగా మంజూరు చేసిన పట్టాదారు పాసు పుస్తకాలను రద్దు చేయాలని కోరారు.

మాట్లాడుతున్న బాధిత రైతులు

ఉద్యోగోన్నతులతోనే సహాయకుల పోస్టులను భర్తీ చేయాలి

డిఇఒ ప్రసాద్‌బాబుకు ఎపిటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగర పాలక ఉన్నత పాఠశాలలో శాంక్షన్ కాబడిన అన్ని రకాల పాఠశాలల సహాయకుల పోస్టులను ప్రమోషన్‌ల ద్వారా భర్తీ చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాల అనంతపురంలో ఎస్‌ఎ సోషియల్ ఉర్దూ మీడియం పోస్టు ఫిబ్రవరి నెల 2022 నుంచి ఖాళీగా ఉందన్నారు. ఈ పాఠశాలలో ఒకే ఒక్క పాఠశాల సహాయకుల పోస్టు మంజూరు చేయబడిందని, ఆ పోస్టు ప్రస్తుతము ఖాళీగా ఉందన్నారు. 139 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ఒక్క పాఠశాల సహాయకులు కూడా లేనందున చాలా ఇబ్బందికి గురవుతున్నారని తెలిపారు. ఉర్దూ సోషల్ పాఠశాల సహాయకుల పోస్టును అనంతపురం డిఈఓ గతంలో విడుదల చేసిన టెనిటివ్ లిస్టులో కూడా ఖాళీగా చూపడం జరిగిందన్నారు. కావున శాంక్షన్ కాబడిన ఉర్దూ సోషల్ పాఠశాల సహాయకుల పోస్టును ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని డీఈవో ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ సబ్ కమిటీ సభ్యులు ఓబులేసు, బాబా ఫక్రుద్దీన్, రాష్ట్ర కౌన్సిలర్ సర్దార్ వలి, నాయకులు కలిముల్లా, భాగ్యరాజ్, నస్రుల్లా తదితరులు పాల్గొన్నారు.

డిఇఒ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

బుక్కరాయసముద్రం : మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 2023-24 సంవత్సరానికి సంబంధించి గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయా పంచాయతీల్లో రూ.11,54, 22,821 పనులు జరగ్గా రూ.1,75,93,730 కోట్ల అవకతవకలు జరిగినట్లు ఎస్ఆర్‌పిలు తెలిపారు. అత్యధికంగా బుక్కరాయసముద్రం, దయ్యాలకుంటపల్లి పంచాయతీల్లో అవకతవకలు జరిగినట్లు నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పీడీ సలీంబాషా, అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఎపిడి అనురాధ, ఎస్ఆర్పి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సొలమన్‌రాజ్, ఎపిఒ పోలేరయ్య పాల్గొన్నారు.

1303 మెట్రిక్ టన్నుల యూరియా రాక

అనంతపురం : 1303మెట్రిక్ టన్నుల యూరియా ఎరువులు సోమవారం స్థానిక ప్రసన్నయాపల్లికు వచ్చినట్లు అనంతపురం ఎడిఎ ఎం.రవి తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాలు మేరకు ఇందులో 800మెట్రిక్ టన్నులు ఎపి మార్క్‌ఫెడ్‌కు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 503 మెట్రిక్ టన్నుల యూరియా ప్రయివేట్ డీలర్లకు కేటాయించామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

యల్లనూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిస్కార వేదికలో పలువురు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఇందులో ఇళ్ల సమస్యలు పరిష్కరించాలని చింతకాయమంద గ్రామస్తులు తహశీల్దార్ రాజాకు వినతిపత్రం అందజేశారు. అలాగే అనుభవంలో ఉన్న భూములను ఆన్‌లైన్ చేయాలని దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు.

మార్వాడీలను అడ్డుకోవాలి

గార్లదిన్నె : మండల కేంద్రంలో నాణ్యతలేని వస్తువులను విక్రయిస్తున్న మార్వాడీల దందాను అడ్డుకోవాలని మండల కేంద్రంలోని వ్యాపారులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ డిసెంబరు 30వతేదీలోగా మండలంలో వ్యాపారం చేస్తున్న మార్వాడీలు మండలాన్ని వదిలి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ గౌస్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో గార్లదిన్నె మండలం వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు సంజీవరాయుడు, కార్యదర్శి నాగిరెడ్డి, జగదీష్, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన

గార్లదిన్నె : స్మార్ట్ ఆశీర్వాద్ ప్రాజెక్టులో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని కోటంక గ్రామంలో గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఐటీసీ వారి సహకారంతో అయోడిన్ లోపం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా అయోడిన్ లోపం వల్ల బుద్ధి మందగించడం, థైరాయిడ్ గ్రంధి సమస్యలు, పిల్లల్లో మానసికంగా ఉత్పత్తి లోపం జరగడం వంటివి జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ కోఆర్డినేటర్ దుర్గయ్య, సర్పంచి ఎర్రిస్వామి, అంగన్వాడీ రామాంజినమ్మ, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం జాతీయ గణిత దినోత్సవాన్ని పాఠశాల కరస్పాండెంట్ మారెన్న ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివ, విశ్రాంతి ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు, పాఠశాల డైరెక్టర్లు నాగభూషణ, తిప్పే స్వామి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు..

ఉత్తమ అవార్డు అందుకున్న ఎడిఎ ఎం.రవి

అనంతపురం : జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ఉత్తమ వ్యవసాయ సహాయ సంచాలకులుగా అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ ఎం.రవి అవార్డును అందుకున్నారు. ఈమేరకు సోమవారం అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డులు అందజేశారు. ఈసందర్భంగా ఎడిఎ ఎం.రవికి అనంతపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు శేఖర్‌రెడ్డి, జె.శశికళ, సోమశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారులు మురళీకృష్ణ, ఎంపిఇఒ కార్యాలయ సిబ్బంది రమణారెడ్డి, నరసింహా, లావణ్య, జ్యోతి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

పుట్లూరు : గండికోట నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని తీసుకొచ్చి మండలంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మండల రైతులు కోరారు. ఈమేరకు అనంతపురంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గండికోట యల్లనూరు మండలంలోని నిట్టూరు గ్రామానికి సమీపంలో గండికోట పైపులై ఉందని, అక్కడ నుంచి పుట్లూరు చెరువుకు పైపులైన్ ద్వారా నీరు అందిస్తే దాదాపు 8 గ్రామాలకు తాగు, సాగునీటి కొరత తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు పుల్లారెడ్డి, సీసీ మల్లికార్జున్‌రెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎఒగా కాత్యాయిని

ప్రజాశక్తి-పుట్లూరు

జాతీయ రైతు దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఎఒగా పుట్లూరు మండల వ్యవసాయ శాఖ అధికారిణి కాత్యాయని ఎంపికయ్యారు. ఈమేరకు జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా మొమెంటో అందజేసి ఘనంగా సత్కరించారు.

ఎఒ కాత్యాయినిని సన్మానిస్తున్న అతిథులు

నేరాలు ఘోరాలు

యువకుడు దారుణహత్య

మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి

తాడిపత్రి రూరల్ : యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన మండల పరిధిలోని రావివెంకటాంపల్లి గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని రావివెంకటాంపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ కుమారుడు వంశీకుమార్ (26) లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈనేపథ్యంలో దారుణ హత్యకు గురి కావడం గమనార్హం. కుటుంబ సభ్యుల వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రైల్లో ప్రయాణికుడు మృతి

మృతిచెందిన ఆంజనేయులు

తాడిపత్రి రూరల్ : ఇంటర్ సిటీ రైల్లో ప్రయాణికుడు ఆంజనేయులు (35) సోమవారం మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పామిడి మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు రైల్వే కోడూరులోని ఓ బార్బర్ దుకానంలో పని చేస్తున్నాడు. ఇందులో భాగంగా సొంతూరుకు వెళ్లడానికి ఇంటర్ సిటీ రైల్లో బయలుదేరాడు. తాడిపత్రి సమీపంలో అనారోగ్యానికి గురై అస్వస్థకు గురయ్యాడు. దీంతో తోటి ప్రయాణికులు తాడిపత్రి రైల్వేస్టేషన్‌లోఉన్న రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జీఆర్పీ పోలీసులు తాడిపత్రి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆంజనేయులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని పి.ఎర్రగుడి గ్రామానికి చెందిన రైతు రఘురామిరెడ్డి సోమవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రైతు రఘురామిరెడ్డి కొన్నాళ్లుగా అనారోగ్యంతో పాటు కుటుంబ సమస్యలతో బాధపడుతుండేవాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నప్పటికీ నయంకాకపోవడంతో భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అతన్ని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.